సాక్షి చిత్తూరు

మంగళవారం । 14 । జనవరి । 2025



పెద్దాయన కృషి ఫలించింది!

పుంగనూరులో పరిశ్రమల ఏర్పాటుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి చేసిన కృషి ఎట్టకేలకు ఫలించింది. - 8లో



సై అంటే సై

వెదురుకుప్పం మండలం మెండివెంగనపల్లెలో సైఅంటే సై అన్నట్లు సాగిన జల్లికట్టులో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. - 8లో



భోగి మంటల్లో కరెంట్ బిల్లులు

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం నేతలు కరెంట్ బిల్లులను భోగి మంటల్లో వేసి కాల్చివేశారు. - 8లో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా చండీహోమం



బోయకొండలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

చౌడేపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి యాగశాలలో కొలువుదీర్చారు. అనంతరం ఈఓ ఏకాంబరం, ఉభయకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. తరువాత వేద పండితులు చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున చండీ హోమం నిర్వహిస్తున్నట్టు ఈఓ ఏకాంబరం తెలిపారు. పూర్ణాహుతి అనంతరం అధికారులు ఉభయకర్తలకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా కవి సమ్మేళనం



వెంకటయ్యను సన్మానిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి ఆధ్వర్యంలో సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు సంక్రాంతి విశిష్టత, సంస్కృతి సంప్రదాయాలు, సమాజం సమకాలీన అంశాలు, మాన విలువలతో పాటు బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై స్వీయ కవితలు వినిపించారు. అనంతరం ఇటీవల శాంతిపురం ఎంఈవో–2గా అదనపు బాధ్యతలు చేపట్టిన తీగల వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. కవులు గొడుగు చింత గోవిందయ్య, తీగల వెంకటయ్య, గురునాథం, బాలముని శివ కుమార్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ దరఖాస్తుల గడువు 23 వరకు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: 2025–2026 విద్యా సంవత్సరానికి ఎంపిక పరీక్ష ద్వారా 6వ తరగతి, 9వ తరగతులకు బాల బాలికలకు అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో జరగనున్న సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష దరఖాస్తులు సమర్పించేందుకు గడువు 23 జనవరి 2025 వరకు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు వయసును బట్టి 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు చక్కటి అవకాశం ఉందన్నారు. వివరాల కోసం 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

నగుబాటే





గుంతలమయమైన బైరెడ్డిపల్లి మండలంలోని కడపనత్తం రహదారి

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత.. ఇదీ జిల్లాలోని రహదారుల దుస్థితి. ఏ దారిలో వెళ్లాలన్నా ఒడిదుడుకుల ప్రయాణమే.. బండి తోలాల? గుంత చూడాలా అని వాహనచోదకులు బెంగ చెందుతున్నారు. అధ్వాన రోడ్లలో ప్రయాణంతో ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. సంక్రాంతి నాటికి రోడ్లలో గుంతలన్నీ పూడ్చివేస్తాం.. వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.. అని కూటమి సర్కారు హామీలు మీద హామీలు గుప్పించింది. అయితే పెద్ద పండుగ కాస్త దాటిపోతున్నా.. ఏ రహదారి చూసినా ఏమున్నది గర్వకారణం అన్న చందంగా ఉంది. కూటమి సర్కారు చేసిన బాసలు నగుబాటగా మిగులున్నాయి.

- సంక్రాంతికి రోడ్ల మరమ్మతు పూర్తి చేస్తామని కూటమి హామీ
- జిల్లాలో అరకొరగా రోడ్ల పనులు
- వంద శాతం పూర్తి చేయక ఏమార్చిన సర్కారు
- వేసిన కొద్దిపాటి రోడ్లూ నాసిరకంగానే
- విమర్శలు గుప్పిస్తున్న జిల్లా వాసులు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజలను మోసం చేసింది. ఇది చాలదన్నట్లు ఐదు నెలల క్రితం గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించి, కపట హామీలు గుప్పించారు. సంక్రాంతి నాటికి పల్లె పండుగలో మంజూరు చేసిన ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ రోడ్ల పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సంక్రాంతి పండుగ వెళుతున్నా ఆ హామీ మాత్రం నెరవేరలేదు. మంజూరు చేసిన రోడ్ల పనులకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో హామీ బుట్టదాఖలైంది. అరకొర నిధులు మంజూరు చేయడంతో క్షేత్రస్థాయిలో పలు చోట్ల అరకొరగా వేసిన రోడ్లు సైతం నాసిరకంగా ఉన్నాయి. ప్రజల హామీ పక్కన పెడితే ఎలాగైనా నిధులను దోచుకునేందుకు టీడీపీ కూటమి ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారు.

1,577 పనులకు 582 మాత్రమే పూర్తి

జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 1,577 పనులకు అనుమతులిచ్చారు. అయితే ఆ పనుల్లో ఇప్పటివరకు 582 పనులు మాత్రం పూర్తి చేశారు. మిగిలిన 995 పనులు ఇంత వరకు ప్రారంభించనేలేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని దుస్థితి. 1,577 పనులకుగాను రూ.88.31 కోట్లతో 204 కిలోమీటర్ల మేరకు రోడ్లు వేస్తామని ఐదు నెలల క్రితం హామీ ఇచ్చారు. 204 కిలోమీటర్లకుగాను ఇప్పటివరకు 72.43 కిలోమీటర్ల వరకు మాత్రమే రోడ్లు పూర్తి చేశారు. రూ.88.31 కోట్లకుగాను రూ.22.27 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మిగిలిన రూ.66.04 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారు.

ఉదాహరణలివీ..

- జిల్లాలోని చిత్తూరు నియోజకవర్గం గుడిపాల మండలంలో 10,531.90 మీటర్లు సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా 4,615.62 మీటర్ల మాత్రమే వేశారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలంలో 2,275 మీటర్ల సీసీ రోడ్ల పనులకు గాను 549 మీటర్ల మాత్రం పూర్తి చేశారు.
- పూతలపట్టు నియోజకవర్గంలో 6,690 మీటర్ల సీసీ రోడ్లకుగాను 2,181.95 మీటర్లు మాత్రం పూర్తి చేశారు.
- కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలో 11,255 మీటర్ల సీసీ రోడ్లు వేయాల్సి ఉండగా 6,856.70 మీటర్ల మాత్రం పూర్తి చేశారు.
- జిల్లాలోని చిత్తూరు, జీడీ నెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పంలో 14,841 మీటర్లు రూ.616.50 లక్షలతో చేపట్టాల్సి ఉంది. అయితే సంక్రాంతి పండుగ నాటికి రూ.98.1 లక్షలను ఖర్చు చేసి 4,471.90 మీటర్ల అప్రోచ్ రోడ్లు మాత్రం వేసి చేతులు దులుపుకున్నారు.
- జిల్లాలోని చిత్తూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు నియోజకవర్గాల్లో రూ.686 లక్షలతో 12,443 మీటర్ల మేరకు బీటీ రోడ్లు వేయాల్సి ఉంది. ఇందులో 10 శాతం పనులు కూడా పూర్తి చేయని దుస్థితి.

జిల్లాలో పీఆర్ శాఖ పరిధిలో ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ రోడ్ల పురోగతి ఇలా

నియోజకవర్గం	మంజూరు చేసిన పనులు	పూర్తి చేసిన పనులు
చిత్తూరు	157	39
జీడీనెల్లూరు	227	99
పలమనేరు	189	122
పూతలపట్టు	205	57
కుప్పం	428	167
నగరి	222	54
పుంగనూరు	149	44
మొత్తం	1577	582

పలమనేరు నియోజకవర్గం



మట్టి దారిగా దర్శనమిస్తున్న కడపనత్తం రోడ్డు

నియోజకవర్గంలో ఇచ్చిన మాట ప్రకారం రోడ్లు పూర్తి కాని దుస్థితి. ఇచ్చిన హామీని నెరవేర్చి రోడ్లు పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బైరెడ్డిపల్లి మండలంలోని కడపనత్తం రోడ్డు పనులు ఇప్పటి వరకు ప్రారంభించని పరిస్థితి. దీంతో గుంతలమయమైన ఈ రోడ్డులో ప్రయాణం వాహనచోదకులకు నరకయాతనగా మారింది.

చిత్తూరు నియోజకవర్గం



గుంతలుగా దర్శనమిస్తున్న చిత్తూరు–అరగొండ రోడ్డు

నియోజకవర్గంలో రోడ్ల పనులు అరకొరగానే చేపట్టారు. చిత్తూరు నుంచి కాణిపాకం, అరగొండ, ఐరాల, తవణంపల్లెకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే చిత్తూరు నుంచి అరగొండకు వెళ్లే రహదారి గుంతల మయం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు పనులు ఇంత వరకు టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేదు.

గంగాధరనెల్లూరు నియోజకవర్గం



అధ్వానంగా మారిన తూగుండ్రం–బలిజకండ్రిగ రోడ్డు

గంగాధరనెల్లూరు మండలంలో తూగుండ్రం–బలిజకండ్రిగ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో వెళ్లాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ రోడ్డును సంక్రాంతి లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు పనులు ప్రారంభించనేలేదు.

పుంగనూరు నియోజకవర్గం



గుంతలమయమైన పుంగనూరు–బెంగళూరు రోడ్డు

పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు– బెంగళూరు రహదారిలో మూడు కిలోమీటర్ల మేరకు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డులో దాదాపు 200 వరకు గుంతలు ఉన్నాయి. నిత్యం ఈ రహదారిలో కర్ణాటక రాష్ట్రానికి వేలాది మంది ప్రయాణం చేస్తుంటారు. ఇటీవల మరమ్మతుల పేరుతో తూతూమంత్రంగా కంకర వేసి చేతులు దులుపుకున్నారు.

రోడ్ల పనులు చేపట్టలేదు



సంక్రాంతిలోపు రోడ్ల పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు రోడ్ల పనులు చేపట్టనేలేదు. మా నియోజకవర్గంలో చాలా గ్రామాలకు రోడ్లు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతారే తప్ప ఇప్పటివరకు రోడ్లు వేసిన దాఖలాలు లేవు.

– జయచంద్ర, అక్కన్నగారిపల్లె, జీడీ నెల్లూరు నియోజకవర్గం

హామీ ఇస్తే నెరవేర్చాలి కదా!



విజయపురం మండలం ఓరూరు రోడ్డు అధ్వానంగా ఉంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. రోడ్లు ఇంకెప్పుడేస్తారో అర్థం కావడం లేదు. హామీ ఇస్తే నెరవేర్చాలి కదా. వర్షాలు పడితే రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. ద్విచక్రవాహనాల్లో వెళ్లాలంటే ప్రమాదాలు జరుగుతాయని భయమేస్తోంది.

– నాగరాజు, మాధవరం, నగరి నియోజకవర్గం

కదిలిస్తే కన్నీళ్లే..!

వైకుంఠ ద్వారం నుంచి ఆ కలియుగ వేంకటేశ్వరస్వామివారిని దర్శించి పునీతులు కావాలని తరలివచ్చారు. కానీ అధికా రులు, సిబ్బంది నిర్లక్ష్యంతో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృత్యు వాత పడ్డారు. వారి జ్ఞాపకాలు తలుచుకుని బంధువులు నేటికీ కన్నీటి పర్యంతమవుతున్నారు.

- దిక్కు తోచని స్థితిలో కుమిలిపోతున్నాం
- కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి
- జీవితాంతం ఆ లోటు వెంటాడుతూనే ఉంటుంది
- వైకుంఠ ఏకాదశి టోకన్ల తొక్కిసలాటలో మృతి చెందిన బంధువుల ఆవేదన



తిరుపతిలో టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాట(ఫైల్)

తిరుపతి టాస్క్‌ఫోర్స్: వారిని కదిలిస్తే చాలు.. కన్నీళ్లే సమాధానం చెబుతున్నాయి. తోడుగా ఉన్నవారు దూరమవడంతో దిక్కుతోచని స్థితిలో కుమిలిపోతున్నారు. తల్లిలేని ఆడబిడ్డల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆ ఘటన నుంచి తేరుకోలేక పోతున్నామని, ఆ జ్ఞాపకాలు తలుచుకుని మంచానికే పరిమితమయ్యామని మృతుల కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. వైకుంఠ ద్వార దర్శన టోకన్ల జారీ సందర్భంగా తిరుపతి బైరాగిపట్టెడ, శ్రీనివాసం కౌంటర్లలో ఈనెల 8వ తేదీన జరిగిన తొక్కిలాటలో ఆరుగురు మృతి చెందిన విషయం తెల్సిందే. అందులో నలుగురు ఏపీకి చెందిన వారు కాగా ఒకరు తమిళనాడు, మరొకరు కేరళకు చెందిన భక్తులు ఉన్నారు. ఘటన జరిగి సుమారు ఆరు రోజులు కావస్తున్నా మరణించిన భక్తుల రక్తసంబంధీకులు, బంధువులు ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నారు. కొందరు మంచానికే పరిమితమయ్యామని, జీవితాంతం ఆ లోటు వెంటాడుతూనే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వైజాగ్‌కు చెందిన మృతురాలు లావణ్య కుటుంబ పరిస్థితి దారుణంగా ఉంది. ఆమెకు ఇద్దరు ఆడ పిల్లలు. తల్లి దూరమైన ఆ పసిపాపల ఆవేదన వర్ణనాతీతం. తల్లి లేని జీవితాన్ని ఊహించుకోలేమంటూ ఆవేదన చెందుతున్న ఆ పిల్లలను బంధువులు ఓదార్చలేని పరిస్థితి.

ఆయన జ్ఞాపకాలతో కుమిలిపోతున్నా..



వైకుంఠ వాకిలి నుంచి స్వామివారిని దర్శనం చేసుకోవాలనే తపనతో నా భర్త నాయుడుబాబుతో కలసి 8వ తేదీన తిరుపతికి వచ్చాం. అదే రోజు జరిగిన తొక్కిసలాటలో నా భర్త చనిపోయాడు. కూలి చేసుకుంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్న మా కుటుంబంలో ఈ విషాదం భారీ నష్టాన్ని మిగిల్చింది. నా భర్త వెంట లేడనే బాధను దిగమింగుకోలేకపోతున్నా. కుటుంబంలో 90 ఏళ్ల పెద్దవారు ఉన్నారు. వారి బాగోగులు చూసుకోవాలి. ఆయన తోడు విడిచాడు. నా పరిస్థితి తలచుకుంటేనే భయమేస్తోంది. ప్రభుత్వం సాయం అందించింది. నేను పెద్దగా చదువుకున్న దానిని కాదు. అధికారులు ఉద్యోగం నర్సీపట్నంలోనే కల్పిస్తే నాకు కాస్త వెసులుబాటుగా ఉంటుంది.

– మణికుమారి, మృతుడు నాయుడుబాబు సతీమణి, నర్సీపట్నం

మా ఇంటి మహాలక్ష్మి వెళ్లిపోయింది



మాది వైజాగ్ దగ్గర మద్దెలపాళెం. నేను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. మాకు ఒక్కడే కుమారుడు. కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి వెళ్లాం. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో నా భార్య రజిని మరణించింది. మా ఇంటి మహాలక్ష్మి మాకు దూరమైంది. ఇంట్లో నేను, నా కుమారుడు ఇద్దరమే మిగిలాం. ప్రతి క్షణం ఆమె జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి. గత ఏడాది సంక్రాంతి సంతోషంగా గడిపాం. ఈ ఏడాది ఆమెను దేవుడు దూరం చేశాడు. మా అబ్బాయి విదేశాలకు వెళ్లి చదువుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకోవడం జీర్ణించుకోలేకపోతున్నాం.

– లక్ష్మణరెడ్డి, మృతురాలి భర్త, మద్దెలపాళెం, వైజాగ్

తల్లిని కోల్పోయా..

మాది కేరళ. ఈనెల 8వ తేదీన వైకుంఠ ద్వార దర్శన టోకన్ల జారీ సందర్భంగా తిరుపతి కౌంటర్లలో జరిగిన తొక్కిసలాటలో మా తల్లి నిర్మల చనిపోయారు. ఆ విషాదం నుంచి తేరుకోలేకున్నాం. మా తల్లి నా కళ్ల ఎదుటే తిరుగుతున్నట్లు ఉంది. మా కుటుంబానికి ఆమే పెద్ద దిక్కు. అలాంటిది తల్లి లేకపోవడం కలచివేస్తోంది. ఏ జన్మలో పాపం చేశానో తల్లిని పోగొట్టుకున్నాను.

–కౌషిగ, మృతురాలు నిర్మల కుమార్తె, కేరళ

అమ్మ జ్ఞాపకాలతో..

ఊహించని ఘటనతో కుటుంబం అంతా షాక్‌లోనే ఉంది. దైవదర్శనానికి వెళితే ఇలా జరగడం మనసును కలచివేస్తోంది. అమ్మ జ్ఞాపకాలు ప్రతి క్షణం వెంటాడుతున్నాయి. గత ఏడాది సంక్రాంతి అమ్మతో కలసి సంతోషంగా గడుపుకున్నాం. ఇప్పుడు నాన్నతో పాటు యావత్ కుటుంబం, బంధువులు విషాదంలో మునిగిపోయి ఉన్నాం. జ్వరాలతో మంచాన పడ్డాం.

– మహేష్, మృతురాలు శాంతి కుమారుడు, వైజాగ్

కోలుకోలేకపోతున్నా



తొక్కిసలాటలో చనిపోయిన మల్లిక నా సతీమణి. మాది తమిళనాడు, సేలం జిల్లా మెట్టూరు. ఆ రోజు నా భార్య, మా బంధువులతో కలసి దర్శన టోకన్ల కోసం వెళ్లాం. దురదృష్టవశాత్తు తొక్కిసలాటలో నా భార్యను కోల్పోయాను. ఆమె మరణం మా కుంటుంలో పెను విషాదాన్ని నింపింది. ఆ బాధతో మంచానికే పరిమితమయ్యాం. ఘటన జరిగిన స్థితి నుంచి కోలుకోవడం కష్టంగా ఉంది.

– క్రిష్ణన్, మృతురాలు మల్లిక భర్త, మెట్టూరు, శేలం, తమిళనాడు

అకస్మాత్తుగా కారులో మంటలు



కారులో చెలరేగుతున్న మంటలు

సదుం: కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బూరగమంద గ్రామానికి చెందిన వ్యక్తులు సొంత పనుల కోసం వచ్చి బస్టాండ్ వద్ద కారు ఆపారు. కొద్ది సేపటికే ఇంజిన్‌లో నుంచి అకస్మాత్తుగా పొగలు వచ్చి మంటలు రేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వారు నీటితో మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్టు సమాచారం.

క్లుప్తంగా

పేదల కోసం పరితపించిన ఏకైక సీఎం జగన్


నారాయణస్వామి

కార్వేటినగరం: అధికారం చేపట్టినప్పటి నుంచి పేదల కోసం పరితపించి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన పేదల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పేదల ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి నవరత్నాల పథకాలను తీసుకొచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఓర్వలేని సీఎం చంద్రబాబు ఆ పథకాలను నిర్వీర్యం చేస్తూ ప్రజలను నిత్యం అణగ దొక్కుతున్నారని ఆరోపించారు. జగనన్న జ్ఞాపకాలను చెరిపేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో ఉండేంత వరకు ఎప్పటికీ వారి కల కలగానే మిగిలిపోతుందన్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో వైకుంఠ ద్వారా దర్శనంలో ఏనాడూ చీమకు కూడా హాని జరగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే టోకన్ల జారీలో ఆరుగురిని పొట్టన పెట్టుకున్నారన్నారు. కనీసం ఒక్కసారి కూడా దైవదర్శనానికి రాని కరుడు కట్టిన టీడీపీ కార్యకర్తను టీటీడీ చైర్మన్ చేయడంతోనే అమాయకుల ప్రాణాలు గాల్లో కలసి పోయాయన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు చిన్నస్థాయి ఉద్యోగులను తప్పించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

పెద్దాయన కృషి ఫలించింది!

సీమ..కరువుకు చిరునామా.. అలాంటి గడ్డపై పారిశ్రామిక ప్రగతితోనే అభివృద్ధి సాధ్యమని ఆ పెద్దాయన గుర్తించారు. ఆ దిశగా అడుగులు వేశారు. ఇందులో భాగంగా పుంగనూరు నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు కసరత్తు చేశారు. దీంతో పలు కంపెనీలు పరిశ్రమల ఏర్పాటుకు ముందడుగు వేశాయి. అయితే ప్రభుత్వం మారడంతో ఆ పనులకు కొంత భంగం కలిగింది. అయినా ఆ ప్రజాప్రతినిధి అలుపెరగని యోధుడిలా మొక్కవోని ధైర్యంతో తన లక్ష్య సాధనకు పోరాడి, సాధించారు. ఎట్టకేలకు ఆయన కృషి ఫలించింది. జర్మన్ దేశానికి చెందిన పెప్పర్ మోషన్ ఎలక్ట్రిక్ బస్సుల కంపెనీ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది.

- జర్మన్ పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ రాకకు గ్రీన్ సిగ్నల్
- త్వరలో కంపెనీ పనులు ప్రారంభం
- ఫలించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ కృషి
- హర్షం వ్యక్తం చేస్తున్న పుంగనూరు ప్రజలు


పుంగనూరులో పెప్పర్ మోషన్ కంపెనీ ఏర్పాటు చేస్తున్న ప్రకటిస్తున్న సీఈఓ ఆంద్రియస్ హేగర్, చిత్రంలో నాటి కలెక్టర్ షణ్మోహన్ తదితరులు (ఫైల్)

పుంగనూరు: కర్ణాటక సరిహద్దులోని పుంగనూరు నియోజకవర్గం నాలుగు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేకపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంతర్జాతీయస్థాయి గుర్తింపు కలిగిన జర్మన్ పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కులు కంపెనీ ఏర్పాటుకు కంపెనీకి అప్పట్లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే ప్రభుత్వం మార్పుతో ఆ పనులకు బ్రేక్ పడింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కృషి ఫలించింది. ఈ నేపథ్యంలో పెప్పర్ మోషన్ కంపెనీ ఏర్పాటు పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు బస్సుల కంపెనీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారత్ గురించి...

జర్మన్ పెప్పర్ మోషన్ భారత ప్రముఖ ఎలక్ట్రికల్ మెబులిటీ సొల్యూషన్స్ ఓఈఎంలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. పుంగనూరు సంస్థ తయారు చేయబోయే ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కులతో పాటు బ్యాటరీలు మార్కెట్‌లో విస్తరించేందుకు ఆమోదముద్ర లభించింది. కంపెనీ ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి లభించడం హర్షణీయం.

కంపెనీ ఏర్పాటు ఇలా..


ఎలక్ట్రికల్ బస్సు

జర్మన్ పెప్పర్ మోషన్ ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల కంపెనీ మేలుందొడ్డి పరిసర ప్రాంతాల్లో సు మారు 800 ఎక రాల్లో సుమారు రూ.5 వేల కోట్లతో ఏర్పాటు చే యనుంది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించను న్నాయి. ఈ బస్సుల ఫ్యాక్టరీ నిర్మాణాలను మొదటిదశ ప్రాజెక్టు పూర్తి చేసి, 12 వేల బీఈవీ బస్సు లు, 18 వేల ఎలక్ట్రికల్ ట్రక్కులు, అసెంబ్లింగ్, 10 గిగావాట్ల బ్యాటరీప్యాక్ అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. రెండో దశ 2027 నాటికి 30 వేల బస్సులు, 18 వేల ట్రక్కులు తయారు చేయనున్నారు. మెరుగైన సాంకేతిక సామర్థ్యాల తో అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెంట్స్ సిస్టం ఎలక్ట్రికల్ వెహికల్స్‌ను మార్కెట్‌లో విడుదల చేయనున్నారు. విద్యుత్ వాహన రంగంలో అత్యాధునిక పరిశోధన కేంద్రంగా ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టుకు రాష్ట్రప్రభుత్వం మద్దతు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల కృషి ఫలితమే

రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి పుంగనూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేశారు. పుంగనూరు మండలం ఆరడిగుంట నుంచి మేలుందొడ్డితోపాటు ఇటు పెద్దపంజాణి అటు కర్ణాటక సరిహద్దుల వరకు సుమారు పది వేల ఎకరాల భూమిని పారిశ్రామిక కారిడార్‌గా గుర్తించారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పైపుల ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చారు. ఆ ఫ్యాక్టరీ ఏడాదిలో నిర్మాణం పూర్తి అయ్యి, గత వారం ఉత్పత్తులు ప్రారంభించింది. ఈ శుభ తరుణంలో జర్మన్ బస్సుల ఫ్యాక్టరీ కంపెనీ పనులు ప్రారంభిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం ప్రకటించడంతో పుంగనూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్వతమ్మ కుమారులకు పోలీసుల కౌన్సెలింగ్


చౌడేపల్లె మండలం ఏ.కొత్తకోటలో పార్వతమ్మ కుమారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్‌ఐ ఫకృద్దీన్

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: అమ్మ, నాన్నలు విలువలతోపాటు, మానవత్వంగా వ్యవహరించాలని పోలీసులు పార్వతమ్మ కుమారులు నాగరాజ, చంద్రమౌళి కుటుంబసభ్యులకు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'పార్వతీదేవిలా పెంచి పెద్ద చేస్తే' కథనంపై సీఐ రామ్ భూపాల్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఏఎస్‌ఐ ఫకృద్దీన్ ఏ.కొత్తకోటకు వెళ్లారు. కుమారులు కన్నతల్లిని పోషించలేక రోడ్డుపై వదిలేసిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా చేయకూడదని హెచ్చరించారు. అమ్మ విలువలను తెలుపుతూ కుమారులిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. నవమాసాలు మోసిన తల్లిపై కర్కశంగా వ్యవహరించడం తగదని తమదైన శైలిలో అవగాహన కల్పించారు. తల్లితండ్రుల విలువలను గుర్తించాలని, తమకు తమ బిడ్డలు ఇలాగే చేస్తే అప్పుడు మీరు ఎలా ఉంటారని ప్రశ్నించారు. పార్వతమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కుమారులిద్దరూ ఒకరిపై ఒకరు పోషణ కోసం పోటీ పడి ఇలా చేయడం తగదని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునారావృతమైతే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

పూటుగా మద్యం తాగి తమిళనాడు వాసి మృతి

యాదమరి (కాణిపాకం): మూడు రోజులుగా పూటుగా మద్యం తాగి తమిళనాడు వాసి మృతి చెందిన ఘటన సోమవారం యాదమరి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం సేలం నగరానికి చెందిన చంద్రశేఖర్ (50) లారీ తీసుకెళ్లేందుకు జిల్లా వచ్చాడు. ఈ క్రమంలో యాదమరి మండల కేంద్రంలో లారీని పక్కన పెట్టి మూడు రోజుల నుంచి పూటుగా మద్యం సేవిస్తూ వచ్చాడు. దీంతో సొమ్మసిల్లి పడిపోయాడు. తీరా స్థానికులు అనుమానంతో అతన్ని కదిలించే ప్రయత్నం చేశారు. మృతి చెందినట్లు గుర్తించి లారీపై ఉన్న ఫోన్ నంబర్ చూసి స్థానికులు యజమానికి ఫోన్ చేశారు. ఆ యజమాని మృతదేహాన్ని వదిలిపెట్టి బండిని మాత్రం తీసుకెళ్లాడు. తీరా కుటుంబసభ్యులు, బంధువులకు విషయం తెలియడంతో మృతదేహాన్ని సేలంకు తీసుకెళ్లారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.



రానున్న రోజులు మనవే

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి


నేతలతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

చౌడేపల్లె: రానున్న రోజులు మనవే...కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి చౌడేపల్లె మండల నేతలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం తిరుపతిలోని పెద్దిరెడ్డి నివాసంలో నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఐకమత్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు ప్రభుత్వవైఫల్యాలను ప్రజలకు తెలిపి, వారిలో చైతన్యం తేవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన దాడులు, అరాచకాలపై నాయకులతో పాటు ప్రజలు పోరాటం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తూ అబద్దాలతో మాయ చేస్తున్న ప్రభుత్వానికి గుణపాఠం ప్రజలే చెబుతారన్నారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని, అందరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. అలాగే నూతనంగా నియమితులైన నియోజకవర్గ కార్య నిర్వాహక కార్యదర్శి పుదిపట్లకు చెందిన ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే, ఎంపీని కలిశారు. తమపై నమ్మకంతో పదవి కేటాయించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీవీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలు, దౌర్జన్యాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంజిబాబు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు పద్మనాభరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రవి చంద్రారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు స్విమ్స్ ఓపీకి సెలవు

తిరుపతి తుడా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్విమ్స్‌లోని ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. అత్యవసర సేవలు యథాతథంగా కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

భోగి మంటల్లో కరెంట్ బిల్లులు

- సీపీఎం నాయకుల వినూత్న నిరసన


పలమనేరులో పెరిగిన కరెంట్ బిల్లులను భోగి మంటల్లో కాల్చుతున్న సీపీఎం, ప్రజాసంఘాలు

పలమనేరు: పెరిగిన కరెంట్ చార్జీలకు నిరసగా సీపీఎం నాయకులు కరెంట్ బిల్లులను సోమవారం భోగిమంటల్లో కాల్చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, వ్యవసాయ కార్మికసంఘం, కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ పాత వస్తువులను భోగిమంటల్లో కాల్చివేయడం మన ఆనవాయితీ అయినందున పెరిగిన కరెంట్ బిల్లులను భోగిమంటల్లో కాల్చేశామన్నారు. అదానికి మేలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై భారం మోపుతున్నాయన్నారు. ఎన్నికల సందర్భంగా ఇదే పలమనేరు కొచ్చిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులను పెంచబోమని ప్రజల ముందు హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి రాగానే ముందుగా రూ.20 వేల కోట్ల కరెంటు భారాన్ని పేదలపై మోపారని దుయ్యబట్టారు. దీనికితోడు మరింత దోచుకోవడానికి స్మార్ట్‌మీటర్లను పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో స్మార్ట్‌మీటర్లు వద్దన్న ఇదే చంద్రబాబు ఇప్పుడెలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కూటమి అబద్దపు హామీల కారణంగా ప్రజలు సంక్రాంతిని సైతం జరుపుకోనేందుకు డబ్బులేక, ఆకాశాన్నింటిన ధరలతో పస్తులుండాల్సిన పరిస్థితికి తీసుకొచ్చిన కూటమి సర్కార్‌కు నూకలు చెల్లాయన్నారు. ఈ విషయం త్వరలో తేటతెల్లం అవుతుందన్నారు. ఓబుల్‌రాజు, ఈశ్వర్, భువనేశ్వరి, సుబ్రమణ్యం, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'ను భోగిమంటల్లో కాల్చేశారు!


భోగిమంటలు వేస్తున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : కూటమి సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను భోగిమంటల్లో కాల్చేసిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా ఆరోపించారు. సోమవారం నగరిలోని తన నివాసంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి భోగి సంబరాలు జరుపుకున్నారు. భోగి మంటల చుట్టూ కుటుంబసభ్యులతో కలిసి భోగి పాటలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. ప్రజల జీవితాల్లో భోగిభాగ్యాలు నిండాలని, భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటేనే మరింత ఆనందంగా ఉంటుందని, ఆయుష్షు కూడా పెరుగుతుందన్నారు. బంధువుల మధ్య బంధుత్వాలు పెంచే పండగే సంక్రాంతి అన్నారు. పల్లె వాతావరణంలో పండుగలు జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనమన్నారు. గత ఐదేళ్లలో సంక్రాంతి కాంతులు ప్రజల్లో కనిపించేవన్నారు. నేడు ప్రజలు తాము ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను భోగి మంటల్లో కాల్చేశారన్నారు. సంక్రాంతి అంటేనే రైతులు పండగని ఈరోజు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతు సాగు చేసిన పంటలకు బీమా లేదన్నారు. గిట్టుబాటు ధర కూడా దక్కలేదన్నారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత లేకుండా వ్యవహరిస్తుంటే డిప్యూటీ సీఎం క్షమాపణలు అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. హిందుత్వ పార్టీ కూటమిలో ఉన్నా తిరుపతి తొక్కిసలాట సంఘటనకు కారణమైన వారిని అరెస్టు చేయలేదన్నారు. బాధిత కుటుంబాలకు టీటీడీ ఇచ్చే ఎక్స్ గ్రేషియాతో పాటు ప్రభుత్వం కూడా ఎక్స్ గ్రేషియ ఇవ్వాలన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ కమిటీలో పలువురికి చోటు

సాక్షి, తిరుపతి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కమిటీలో చిత్తూరు, తిరుపతి జిల్లా వాసులకు చోటు కల్పిస్తూ సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. మున్సిపల్ విభాగం ఉపాధ్యక్షుడిగా ఆర్ వెంకటేశులు, ప్రధాన కార్యదర్శిగా హరిణిరెడ్డి, కార్యదర్శిగా సాయిక్ మహ్మద్ జాఫర్, అఫిషియల్ స్పోక్ పర్సన్‌గా ఖైజీర్‌ఖాన్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్ డీ హఫీజ్, గుణశేఖర్‌ను నియమించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

అనుబంధ విభాగం..

రాష్ట్ర మున్సిపల్ విభాగంతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల అనుబంధ విభాగాల అధ్యక్షులను కూడా ప్రకటించింది. యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఉదయ్ వంశీ(తిరుపతి), మహిళ విభాగం బొర్ర మాధవి(సత్యవేడు), రైతు విభాగం చంద్రమౌళిరెడ్డి(చంద్రగిరి), బీసీ విభాగం అధ్యక్షుడిగా సుబ్రమణ్యం అలియాస్ చిన్ని యాదవ్ (చంద్రగిరి), ఎస్సీ విభాగం తలారి రాజేంద్ర(తిరుపతి), ఎస్టీ విభాగం దశ సుబ్రమణ్యం(శ్రీకాళహస్తి), మైనారిటీ విభాగం ఎస్‌కే ఖాదర్ (పుంగనూరు), స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి (చంద్రగిరి) నియమితులయ్యారు. అలాగే క్రిష్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా రూబెన్ (పలమనేరు), పంచాయతీరాజ్ విభాగం కే మనోహర్(పూతలపట్టు), ఆర్‌టీఐ విభాగానికి కొత్తపల్లి విజయకుమార్(తిరుపతి), ఐటీ విభాగం నలి ప్రకాష్ రెడ్డి (పుంగనూరు), వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా కే ఈ ఢిల్లీబాబు(శ్రీకాళహస్తి) నియమితులయ్యారు. మున్సి పల్ విభాగం అధ్యక్షుడిగా ఎస్‌డీ హఫీజ్(కుప్పం), గ్రీవెన్స్ విభాగం మోహన్‌నాయక్ (కుప్పం), వాణిజ్య విభాగం బి.హేమసుందర్‌రెడ్డి(జీడీనెల్లూరు), వైద్య విభాగానికి జెల్లి వర వరప్రసాద్(తిరుపతి), ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా గిరిధర్‌రెడ్డి (చిత్తూ రు) నియమితులయ్యారు. అలాగే వైఎస్సార్ టీయూసీకి సాయిక్ చంద్ బాషా(చిత్తూరు), వీవర్స్ విభాగం బాలక్రిష్ణన్ (నగరి), సాంస్కృతిక విభాగం కొండూరు శాస్త్రిరాజు (సత్యవేడు), దివ్యాంగుల విభాగం కోనాత్తం చంద్రశేఖర్ (పూతలపట్టు), సోషల్ మీడియా విభాగం వెల్లూరు రాకేష్(సత్యవేడు), పబ్లిసిటీ విభాగం సుబ్రమణ్యం(జీడీనెల్లూరు), బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎస్ వెంకటేష్‌రెడ్డి (జీడీనెల్లూరు), అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులుగా కొండవారి కుమారి(తిరుపతి)ని నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనలో పేర్కొంది.

మూడు ఆలయాల్లో చోరీ


దొంగలు పగలగొట్టిన హుండీ

రొంపిచెర్ల: మండలంలో మూడు ఆలయాల్లో హుండీలను పగలగొట్టి నగదును చోరీ చేసిన సంఘటనలు సోమవారం రాత్రి జరిగాయి. గ్రామస్తుల కథనం మేరకు.. మోటుమల్లెల పంచాయతీలోని బి.చల్లావారిపల్లె–ఆదినవారిపల్లె గ్రామాల మధ్యలో ఉన్న ఊడగలమ్మ ఆలయంలో హుండీ పగులగొట్టి అందులోని సుమారు రూ. 50 వేలు నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆదినవారిపల్లె దళితవాడలోని మాతమ్మ ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులోని డబ్బును చోరీ చేశారు. అలాగే వంకిరెడ్డిగారిపల్లెలోని బాట గంగమ్మ ఆలయంలో కూడా హుండీలో నగదు చోరీ జరిగింది. ఒకే రోజు మూడు ఆలయాల్లో చోరీలు జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎస్‌ఐ తీరుపై హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు


ఎస్‌ఐపై ఫిర్యాదు చేసిన సురేష్

శాంతిపురం: ఎస్‌ఐ తనను బెదిరించి, దుర్భాషలాడినా పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోలేదని ఓ యువకుడు జాతీయ మానవహక్కుల కమిషన్, రాష్ట్ర లోకాయుక్తలను ఆశ్రయించాడు. శాంతిపురం మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ గంగాపురానికి చెందిన ఎన్‌వీ సురేష్ కథనం మేరకు.. జంగాలపల్లికి చెందిన తన మిత్రుడి కుమారుడు కనిపించడం లేదని బాధితులు గత నెలలో రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పురోగతిని తెలుసుకునేందుకు బాధిత కుటుంబంతో కలసి గత నెల 24వ తేదీ తాను పోలీసుస్టేషన్ వద్దకు వెళ్లాడు. అక్కడ స్టేషన్ ఎదుట సురేష్‌ను చూసిన ఎస్‌ఐ నరేష్ అందరి ముందే అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించాడు. దీన్ని వీడియో తీసే ప్రయత్నం చేసిన సురేష్ నుంచి కానిస్టేబుల్ బీఆర్ నాయక్ ఫోన్ బలవంతంగా లాక్కుని వీడియోను డిలీట్ చేశాడు. ఈ వ్యవహారంపై అదే రోజు బాధితుడు కుప్పం డీఎస్పీకి ఫిర్యాదు చేశాడు. గతంలో తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమ బియ్యం రవాణాపై ఎస్‌ఐకి ఫిర్యాదు చేసినందుకే ఇలా చేశాడని పేర్కొన్నాడు. తనను, తన తల్లిని అవమానించేలా మాట్లాడి, తన ప్రాణాలు తీస్తానని బెదిరించిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరాడు. తర్వాత ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న వారిని డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి ఎస్‌ఐ దౌర్జన్యాన్ని విచారణ చేసుకున్న అధికారులు తదుపరి చర్యలు తీసుకోలేదు. పైగా తనకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పాపానికి నిత్యం పోలీసుస్టేషన్ దగ్గరకు వెళ్లి అక్కడికి వచ్చే ప్రజల నుంచి పోలీసుల పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నానని తనపై అభాండాలను వేస్తున్నారని వాపోయాడు. అందుకే గత ఆరు నెలలుగా పోలీసు స్టేషన్‌లోని అన్ని సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో రికార్డింగుల కాపీ కోసం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నానని చెప్పాడు. జిల్లా ఎస్పీతో పాటు పోలీసు శాఖలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోయిందన్నాడు. దీంతో న్యాయం కోసం జాతీయ మానవహక్కుల కమిషన్, లోకాయుక్తలను ఆశ్రయించినట్టు చెప్పాడు. రెండు విచారణ సంస్థలు తన ఫిర్యాదులను విచారణకు స్వీకరించినట్టు బాధితుడు తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ తన ఆవేదనను 2809/సీఆర్/2025గా, లోకాయుక్త 141/2005గా నమోదు చేశాయని వివరాలను విలేకరులకు వెల్లడించాడు. బహిరంగంగా తన ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించి, ప్రాణాలు తీస్తానని బెదిరించిన ఎస్‌ఐపై న్యాయ పోరాటం కొనసాగిస్తానని చెప్పాడు.

సై అంటే సై

- మొండివెంగనపల్లెలో దుమ్మురేపిన ఎడ్లపందేలు


దూసుకుపోతున్న కోడె గిత్తలు


పలక పట్టిన ఆనందంతో యువత

వెదురుకుప్పం : సై అంటే సై అన్నట్లు సోమవారం వెదురుకుప్పం మండలంలోని మొండివెంగనపల్లెలో సాగిన జల్లికట్టు యువకుల్లో జోష్ తెచ్చింది. రంకెలేస్తూ దూసుకుపోయిన కోడెగిత్తలు...ఈలలు కేకలతో పలకల కోసం యువత చేసిన సాహసాలు...పోట్లగిత్తల పరుషానికి బెంబేలెత్తిన జనం ... ఎడ్ల పందేలు జోరుగా హుషారుగా సాగాయి. దమ్ముంటే కాసుకో అన్నట్లు సాగిన ఎడ్ల పందేల్లో కోడిగిత్తలదే పైచేయి అయ్యింది. మొండివెంగన్నపల్లెలో జరిగిన జల్లికట్టుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పశువులను తీసుకొచ్చారు. నిర్వాహకులు ఎడ్లకు పలకలు, వస్త్రాలు కట్టి పందేనికి సిద్ధం చేసి, ఉసిగొల్పారు. అప్పటికే అధిక సంఖ్యలో గ్రామానికి చేరుకున్న యువత పందేనికి సై అంటే సై అన్నట్టు కోడెగిత్తల కొమ్ములు వంచడానికి ప్రయత్నించారు. అయితే గిత్తలు రంకెలేసుకుంటూ జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయాయి. కాగా కొన్ని ఎడ్ల వేగాన్ని నిలువరించి పలకలు పట్టి తమ ప్రతాపాన్ని చూపారు. అయితే పోట్లగిత్తలు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా జనాన్ని చీల్చుకుంటూ పరుగులు తీసి, తమదే పై చేయి అనిపించుకున్నాయి.